# షకీల

తుళ్లిపడి లేచాను. భూదేవి గుండెలోని బాధలాంటి చీకటి మెల్లమెల్లగా గదిని ఆక్రమిస్తోంది. కంగారుపడి వాచీ కేసి చూశాను. ఐదు గంటలైనా కాలేదు. లేచి కిటికి పద్దకు వెళ్లి తెరలు కొద్దిగా జరిపి రోడ్డు వైపు చూశాను. రోడ్డు నిర్జీవంగా ఉంది. అలికిడి లేదు. ఉదయాన పిల్లల్ని కాలేజీకి, ఆఫీసుకు పంపినప్పుడు సందడిగా కనిపించిన రోడ్డు ఇప్పుడు కూతుర్ని అత్తగారింటికి పంపిన తల్లిలా దిగులుగా ఉంది.

రాత్రి ఎనిమిది గంటలు దాటితే కాని ఆయన రారు. అంత వరకు... ఒక టీ కలుపుకొని తాగొచ్చును. కాసేపు టి.వీ.లో ప్రసారమయ్యే కక్ష సాధింపులు చూడవచ్చు. ఆ తరువాత...

గట్టిగా నిట్టూర్చాను. కిటికీ తెరలు వేస్తుంటే వచ్చింది ఫోన్.

“మధ్యాహ్నం మీటింగుకు రాలేదేమిటే?” అవతలినుంచి అడిగింది లలిత. లలిత నా ఆప్తమిత్రురాలు, మా క్లబ్బు సెక్రటరీ.

“ఈ రోజు మీటింగేమిటే? మీటింగ్ శుక్రవారం కదా?”

“నీ ముఖం మండ! ఈ రోజేనే శుక్రవారం” లలిత అంది. “అంటే నీకు వారాలు కూడా గుర్తుండటం లేదన్నమాట. ఏమిటే నీ పరధ్యానం? పెళ్లై వెళ్లింది నీ కూతురు కాదే, పని మనిషి”.

నిజమే! పెళ్లై అత్తింటికి వెళ్లింది నా కూతురు కాదు, పనిమనిషే! అది అందరి మాట. కాని నాకు... షకీల ఉత్తి పనిమనిషేనా?...

బయటకు వచ్చి తోటలోని కుర్చీలో కూలబడ్డాను నేను.

సూర్యుడికి మబ్బులు నల్ల పరదాలు కప్పుతున్నాయి. వెలుగు పలచబడుతోంది.

“అదేంటి, అలా ఉన్నారు?” పక్కింటావిడ పలకరించింది.

"ఒంట్లో బాగోలేదా, ఏమిటి? బాగా తీసేశారు".

నిజమే! గత నెల రోజులలో బాగా క్షీణించానని నాకు తెలుసు. మొహం పీక్కుపోయింది. కళ్లచుట్టూ నల్లని వలయాలు ఏర్పడ్డాయి. కళ్లలో అస్సలు జీవం లేదు. ఆరు నెలలు మంచాన పడి లేచిన దానిలా ఉన్నానని ఆయన కూడా అన్నారు.

"చూడు పద్మా. నీవు షకీల గురించి బెంగపెట్టుకున్నట్టున్నావు. కాని ఒకటి గుర్తుంచుకో. షకీల మన పనిమనిషి. జీతం కోసం ఇంట్లో పని చేసిన పిల్ల".

ఆ మాటలు నాకు మింగుడు పడలేదు. నాకు బాగా గుర్తు...

సుమారు పదేళ్ల క్రితం తల్లి చీరకొంగు నోట్లో పెట్టుకొని, మా ఇంటికి వచ్చిన షకీలాని చూసి, అది పని చెయ్యటానికి వచ్చిందని అనుకోలేదు నేను. ముక్కు చీమిడి కారుతూ, మాసిపోయి చిరిగిపోయిన గౌను తొడుక్కుని వచ్చిన షకీలని చూసి, నిజం చెప్పాలంటే నాకు అసహ్యం వేసింది. దానికి ఎనిమిదేళ్లుంటాయని, పనిలో పెట్టుకోమని షకీల తల్లి బతిమాలినా పనిమనిషి లేక ఇబ్బంది పడుతూ కూడా నేను ఒప్పుకోలేదు. ఆయనైతే పిల్లలను పంపవలసినది పనిలోకి కాదని, బడిలోకని మళ్లీ మళ్లీ చెప్పారు కూడా.

"మీరు అలాగంటే ఎలాగమ్మా?" షకీల తల్లి అంది. "పనిమనిషి కావాలన్నారటగా."

"అవును, కావాలి. కాని ఈ పసిపిల్ల చేతనా పని చేయించడం."

"ఏం చెప్పనమ్మగారు... పిల్ల చేత పని చేయించటం మాకు మాత్రం కుషీ నా చెప్పండి. మరోదారిలేక... కూడు పెట్టలేక..." కళ్లు వొత్తుకుంది షకీల తల్లి.

ఆమె కన్నీళ్లు చూసిన నాకు కొంత జాలి కలిగింది. మా ఆయన వైపు చూశాను. ఆయనలో ఏ కదలిక లేదు.

"ఇది మూడోది సాబ్. దీని కింద మరో ముగ్గురున్నారు. ఆరుగురి పొట్టలు నింపలేక..."

మా ఆయనకు కోపం వచ్చింది.

"పిల్లలను కనడం తగ్గించుకోండి అంటే వినరు. అందువల్లేగా ఈ బాధ... ఈ దరిద్రం..."

"అవన్నీ మనకెందుకండి" ఇంకేదో అనబోతున్న ఆయనని ఆపి అన్నాను. "మనకు పనిమనిషి కావాలి. దీన్ని పనిలో పెట్టుకుందామా వొద్దా అది చెప్పండి."

ఆయన ఏమీ అనలేదు. కాసేపటికి...

"వొద్దంటే వొద్దు సాబ్. మీ మెహర్బాని. మంచివారు కదాని మీ కాడకు తీసుకొని వచ్చాను, కాదంటే సరే..." గేటు దాటుతూ అంది షకీల తల్లి. "ఈ ఇంటికాడ కాకపోతే

మరో ఇంటికాడ పెడతాను సాబ్. దాని పొట్ట నిండాలి కదా."

నా గుండె కదిలింది.

షకీలని మా ఇంట్లో వొదిలేసి వెళ్ళింది దాని తల్లి. అప్పుడు మొదలైనాయి నా పాట్లు. పనిమాట దేవుడెరుగు కాని కంచంలో పెట్టిన అన్నం కలుపుకొని తినటం కూడ చేతనయ్యేది కాదు షకీలకి. చిన్నపిల్ల కదా అనే జాలితో అన్నం, పప్పు కలిపి కంచంలో పెడితే గంజి కావాలని ఏడ్చేది. అప్పుడప్పుడు గుడ్డు కావాలని పేచి పెట్టేది. విసుగు వచ్చి కబురు పంపితే వచ్చింది షకీల తల్లి.

"ఏం చేస్తాం చెప్పండి" అంతా విని ఆవిడ అంది, "అలవాట్లు అమ్మగారు, అలవాట్లు. దానికేం తెలుసు. మీరు పెట్టే తిండి తినాలంటే పెట్టి పుట్టాలని. నేను దానికి చెప్తానులెండి. అమ్మగారూ, మీరేమీ అనుకోకపోతే ఒక మాట అంటాను."

"చెప్పు..."

"షకీలను మీ పిల్లగా చూసుకోండి. మీరు తినేది పెట్టండి. మేము గుడ్డు తింటాం. మీరు పప్పు తింటారు. ఏదైనా పొట్ట నింపుకోవటానికే కదండీ.."

షకీల తల్లి మాటలలో గొప్ప వాస్తవికత కనబడింది. నాకు ఎలాగూ పిల్లలు లేరు. ఉండివుంటే బహుశా షకీల అంత ఉండేదేమో!

ఆరోజు నుంచి షకీల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాను నేను. షకీలని నా పిల్లలా భావించి మంచి చెడు అన్నీ నేర్పటం ప్రారంభించాను. ఖాళీగా ఉన్నప్పుడు అక్షరాలు దిద్దించేదాన్ని. మూడు నెలల్లో పూర్తిగా మారిపోయింది షకీల. మా ఇంటికి కొత్తగా వచ్చిన వారు షకీల మా పాపే అనుకునేవారు. షకీల తల్లి ప్రతినెల జీతం కోసం వచ్చేది. తల్లిని చూసినప్పుడల్లా ఏడ్చేది షకీల. ఇంటికి తీసుకొని వెళ్ళమని పేచిపెట్టేది.

"ఎందుకే వస్తాను, వస్తాను అని గోల చేస్తావు?" షకీల తల్లి విసుక్కునేది. "ఇంట్లో ఏముందని? కూడా, గుడ్డా. అమ్మగారు చెప్పేది విని, తిని ఉండు" గేటు వద్దకు నడిచింది షకీల తల్లి. తల్లి చీర కొంగు పట్టుకొని ఏడుస్తూ వెనక వెళ్ళింది షకీల.

"ఎందుకే అలా వెంటపడతావు?" చీర కొంగుని విసురుగా విదిలించుకొని కసిరింది షకీల తల్లి. "నేను కాదే నీ తల్లి - ఈ అమ్మగారే నీకు తల్లి. తిండి పెట్టేది ఆ యమ్మే కదే. నేను కనిపారేసాను, అంతే..." కళ్ళు ఒత్తుకొని అంది షకీల తల్లి. "కూడు కావాలంటే ఇక్కడే ఉండు. నీకు ఒక పూట కూడా కూడు పెట్టలేనే".

ఏడుస్తూ వెళ్ళిపోయింది షకీల తల్లి. దరిద్రం అనుబంధాలని ఎలా తుంచేస్తుందో చూసి నా కళ్ళు నిండాయి.

ఆ తరువాత జీతానికి కూడా రావటం మానేసింది షకీల తల్లి. తండ్రిని పంపేది.

ఆరు సంవత్సరాల తరువాత వచ్చింది ఆమె.

"పిల్లను తీసుకెళ్లటానికి వచ్చానమ్మగారు" రాగానే కుండబద్దలు కొట్టినట్టు చెప్పింది. తోటలోని మల్లె చెట్టుకు పాదుచేస్తున్న నా గుండెలో రాయి పడింది. నేను నీరు పోసి జాగ్రత్తగా పెంచే చెట్టులోని మొగ్గని ఇంకా వికసించకముందే తుంచేయటానికి ఆమె చేతులు జాపినట్టు తోచింది నాకు.

తలయెత్తి చూశాను. ఆరేళ్ల క్రితంలా నీరసంగా లేదు ఆమె. మొహం కళకళలాడుతోంది. పాతదే అయినా మంచి చీర కట్టుకుంది. చీర కొంగులో డబ్బు కూడా కట్టుకున్నట్టు కనబడింది.

"రంజాన్ కదండి, రేపు పిల్లని పండగకు తీసుకొని వెళ్దామని..."

నేను ఏమీ అనలేదు. షకీలని పంపాలంటే నాకు బాధగానే ఉంది.

"మిగతా వాళ్లని కూడా అక్కడక్కడ పనిలో పెట్టాను కదండి. వాళ్ళందరూ వచ్చారు. పిల్లలు కలుసుకుంటారని..." మెల్లిగా గొణిగింది షకీల తల్లి. "ఒక నాలుగు రోజులు ఉంచుకొని పంపుతానమ్మా."

మనసు కుదుటపడింది.

షకీలని పిలిచాను. రాస్తున్న పుస్తకంతో వచ్చింది.

"చదువుతున్నావేంటీ తల్లీ!" ఆమె కళ్లలో ఆనందం విరిసింది. షకీలని నఖశిఖాంతం ఒకసారి చూసి అంది. "అమ్మగారు నిన్ను బాగానే చూసుకుంటున్నారే!"

షకీల స్పందించలేదు. ఆరేళ్ల తరువాత తల్లిని చూసిన ఆనందం షకీల మొహంలో కనబడలేదు.

అయిష్టంగానే వెళ్లింది షకీల. మరునాడు సాయంత్రానికే తిరిగొచ్చేసింది.

"అదేమిటే, అప్పుడే వచ్చేసావా? నాలుగు రోజులు ఉంచుకుంటానని అందిగా మీ అమ్మ" అన్నాను.

"నేను ఉండలేనమ్మా. పాకంతా ఒకటే కంపు. దోమలు. మురికి కాలువ ఒడ్డున ఉంటుంది కదండి..."

నాకు నోట మాట రాలేదు. ఆరు సంవత్సరాలలలో ఎంత మార్పు! ఎనిమిది సంవత్సరాలు బతికిన వాతావరణంలో ఉండలేక పోయిందంటే...

"ఏమిటే..."

"అన్నం తింటానమ్మగారు. ఆకలి వేస్తోంది".

షకీలాని అలా చూస్తూ ఉండిపోయాను నేను.

"నిన్న కూడా అన్నం తినలేదమ్మగారు".

"అదేమిటే..." నా కళ్లలో నుంచి నీటి బిందువులు రాలాయి.

"అన్నం ఇక్కడలా లేదమ్మగారు. గుడ్డు, మాంసం వండారు. ఒకటే వాసన" ముక్కు మూసుకొని అంది షకీల. "చూడగానే వాంతి వచ్చిందమ్మ."

బెల్లం కొట్టిన రాయిలా నిలబడిపోయాను నేను.

ఆరేళ్ల క్రితం మా ఇంటికి వచ్చి గుడ్డు కావాలని పేచి పెట్టిన పిల్ల...

అన్నం కలుపుకోవడం చేతకాని పిల్ల... ఇప్పుడు... అన్నంలో పప్పు, నెయ్యి కలుపుకొని ఆత్రుతగా హాయిగా తింటోంది.

ఎంత మారిపోయింది షకీల!

చెప్తే తప్ప పనిపిల్లని తెలియనంత మారింది. ఇంటిలో ప్రతి పని చేసేది. వంట చేసేది. పూజకు దేవుడి మందిరాన్ని అమర్చేది. నాకు ఒంటిలో నలతగా ఉంటే దేవుడికి దీపం పెట్టేది. నాతో పాటు లలితా సహస్రం, హనుమాన్ చాలీసాలు గట్టిగా శ్రావ్యంగా చదివేది. పూల సజ్జ పుచ్చుకొని నాతో గుడికి వచ్చేది.

తను పుట్టిన వాతావరణాన్ని పూర్తిగా మరిచిపోయింది.

ఈ సంఘటన తర్వాత షకీల తల్లి వచ్చినా తండ్రి వచ్చినా పెద్దగా మాట్లాడేది కాదు. ఇంటికి రమ్మని వాళ్లు బలవంతం చేసినా వెళ్లేది కాదు.

"మీ అమ్మాయికి సంబంధాలేమైనా చూస్తున్నారా?" అని ఒకరోజు గుడిలో కొత్తగా కనబడిన ఒకామె షకీలని ఉద్దేశించి అడిగింది.

"పిల్ల చాలా బాగుంది".

ఏమనాలో తోచలేదు. గుడి ప్రాంగణంలో విరబూసిన సంపంగి వైపు దృష్టి మళ్లించాను.

మరో నెలరోజులకు వచ్చింది షకీల తల్లి.

"షకీలకు నిఖా చేద్దామనుకుంటున్నాం అమ్మగారు. ఆయన అక్క కొడుకే. ఇదంటే వాడికి ప్రాణం. నిఖా చెయ్యమని పేచి పెడుతున్నాడు."

"అలాగా..." అన్నానే కాని పెళ్లై షకీల వెళ్లిపోతుందనే ఆలోచనే చాలా కష్టంగా తోచింది.

"ఏం చదివాడు అతడు?" నిరుత్సాహంగానే అడిగాను నేను.

"ఏమోనమ్మా నాకు తెలియదు. మంచి వాడు. వాడికి చిన్నప్పటినుండి షకీలంటే ప్రాణం."

"మరి ఉద్యోగం..."

"వర్కుషాపులో చేస్తాడమ్మ. అప్పుడప్పుడు చదువుకున్న పెద్దోళ్లతో మీటింగులకు తిరుగుతుంటాడమ్మా"

"మరి జీతం..."

"తెలియదు. షోషణకు లోటు లేదు."

మరో నెలరోజులకు కబీర్‌ని పెళ్లి చేసుకొని పాతబస్తీకి వెళ్లిపోయింది షకీల.

గట్టిగా వీచింది గాలి. తల్లి అక్కున చేరి హాయిగా బతికిన ఆకులు ఎక్కడనుంచో వచ్చిన గాలితో ఊసులాడి చేతులు కలిపి ఇప్పుడు తల్లిని విడిచి దూరంగా ఎగిరిపోయాయి. జీవిత సత్యమదేనని తెలిసినా ఆ సత్యాన్ని జీర్ణించుకోలేని నేను గట్టిగా నిట్టూర్చాను.

సంధ్యాదీపం పెట్టాలి. స్నానం చేయాలి. కుర్చీలో నుంచి లేచాను.

మరోసారి రోడ్డు వైపు దృష్టి సారించాను. షాక్ తగిలినట్టు ఆగిపోయాను. వీధి మలుపు తిరుగుతున్న అమ్మాయి షకీల కదూ!

కళ్లు చిట్లించి మళ్లీ మళ్లీ చూశాను.

అవును! షకీలాయే! పక్కన కబీర్ కూడా ఉన్నాడు.

"రా, లోపలకు రా" ఆప్యాయంగా పిలిచాను. "రా, బాబూ!"

ఇద్దరు లోపలకు వచ్చారు.

"కూర్చోండి"

షకీల కూర్చోలేదు. ఇంట్లోకి పరుగెత్తింది.

"అదేమిటమ్మా, బీరువా ఇలా మార్చారు" లోపలనుంచే అడిగింది షకీల.

"చెప్తానులే. ఇలా వచ్చి కూర్చో. ఏంటి విశేషాలు?"

అత్తవారింటి నుండి వచ్చిన కూతురు కబుర్లు వినాలనే తల్లి ఆత్రుత నా గొంతులో గోచరించింది.

"వస్తున్నానమ్మా" షకీల అంది. "ఇంకా సంధ్యా దీపం పెట్టలేదు కదా, పెట్టి వస్తాను."

"ఇదండీ వరుస" కబీర్ అన్నాడు. "మా ఇంటిలో కూడా పొద్దున్నా-సాయంత్రం దీపం పెడుతుందండి. ఇల్లంతా దేముడు పటాలతో నింపేసిందండి".

నేనేమీ అనలేదు. షకీల వైపు చూశాను.

"అంతే కాదండి" కబీర్ మళ్లీ అన్నాడు. "పొద్దున లలితా సహస్రం, హనుమాన్ చాలీసా గట్టిగా చదువుతుందండి. శనివారమైతే గుడికి వెళ్లాలని పేచి పెడుతుందండి".

"అలవాట్లు బాబు" నేను మెల్లిగా అన్నాను. "నాతో ఉంది కదా."

"నిజమేనమ్మ గారు. నేను అర్థం చేసుకోగలనండి. కబీర్‌ని కదా. నేనూ చాలా ఊర్లు తిరిగిన వాడినే. జీవిత సత్యమెరిగిన వాడినే. అర్థం చేసుకోగలను. మతం ఒక జీవిత విధానం. అది పుట్టుకతో రాదని, పెరిగిన వాతావరణాన్ని బట్టి వస్తుందని నాకు తెలుసమ్మగారు."

నేను ఆశ్చర్యంతో ఉండిపోయాను.

"ఏం చదివావు బాబు?"

"జీవితాన్ని చదివానండి. పుట్టింది జీవించటం కోసమే. ఆనందంగా జీవించటం కోసమే. షకీల అంటే నాకు ప్రాణం."

కబీర్ ఒక నిమిషం ఆగాడు. ఆ తరువాత అన్నాడు.

"ఇప్పుడు మేము ఉండేది పాతబస్తీలో కదండీ. షకీల ప్రవర్తన చూసి ఇరుగుపొరుగువారు ఊరుకోవటం లేదండి. నేను హిందూ పిల్లను చేసుకున్నానని కళ్లు ఎర్ర చేస్తున్నారండి అందుకే.."

నా మనస్సు కీడు శంకించింది. ఆత్రుతగా అడిగాను. "అందుకే..."

"నేను ఒక నిర్ణయానికి వచ్చాను. నేను పాతబస్తీ వదిలేస్తాను. ఇక్కడే ఎక్కడైనా ఇల్లు తీసుకుంటాను. అంతవరకు ఒక పదిరోజులు షకీలను మీ ఇంట్లోనే ఉంచండి".

నా మనస్సు కుదుటపడింది. అతడు నిజంగా కబీరే అనిపించింది.

షకీల సంధ్యా దీపం వెలిగించింది.

కిటికి తెర తొలగించి చూశాను.

వెలుతురు తగ్గినా సూర్యుడు ఇంకా అస్తమించలేదు.

అవును మరి. సూర్యుడుకి అస్తమయం లేదుగా!

***